క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ పర్యటన



తాగునీరు వృథా అవుతుండడాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సోమవారం పర్యటించారు. పారిశుధ్యం సహా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాను ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చూడాలని, తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శ్రీవేణు గోపాలస్వామి ఆలయ కూడలి వద్ద కుళాయిల ద్వారా తాగునీరు లీకు అవుతుండడాన్ని గమనించి, లీకేజీని అరికట్టాలని సూచించారు.

మూడో రైల్వేలైన్ పనుల పరిశీలన



పెంట వద్ద రైల్వే వంతెనను ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వరన్

బొబ్బిలిరూరల్: స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలో కొత్తగా నిర్మించిన మూడో రైల్వేలైన్ పనులను ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వరన్ పంకవాల్ సోమవారం పరిశీలించారు. పెంట వద్ద నూతనంగా చేపట్టిన వంతెన నిర్మాణాన్ని చూసి, అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన మూడో లైన్ పనులు పూర్తి చేయాలని కోరారు.

ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ ఏర్పాటుకు చర్యలు



సిగ్నల్ పాయింట్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజాం సిటీ: స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. టౌన్ సీఐ కె.అశోక్ కుమార్, టీపీవో తేజేశ్వరరావు, ఏఈ వెంకట్‌లు సిగ్నల్ వ్యవస్థకు సంబంధించి విశాఖపట్నానికి చెందిన కిశోర్, సుధాకర్‌లు స్థలాన్ని సోమవారం పరిశీలించారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్ పాయింట్ ఏర్పాటు అనివార్యమని, త్వరలో దానిని ఏర్పాటు చేయనున్నామన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయాలి



రీసర్వే పరిశీలిస్తున్న తహసీల్దారు ధర్మరాజు

వంగర: భూముల రీసర్వే వేగవంతం చేయాలని తహసీల్దారు దిరిశాల ధర్మరాజు తెలిపారు. మండలంలోని మరువాడ గ్రామంలో జరుగుతున్న రీసర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ నెల 20వ తేదీ లోగా సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల సర్వేయరు నాగేశ్వరరావు, వీఆర్‌వోలు బెజ్జిపురం బలరాం, పిల్లి జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య మట్టి, త్రివేణి సంగమ జలం అందజేత

బొబ్బిలి: స్థానిక పాతబస్టాండ్ వద్ద దాసాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి అయోధ్య నుంచి తీసుకువచ్చిన మట్టి, ప్రయాగ్‌రాజ్ నుంచి తెచ్చిన త్రివేణి సంగమం జలాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు తూముల భాస్కరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ అచ్యుతవల్లిలు ఆలయ కమిటీ సభ్యులకు బొబ్బిలిలో సోమవారం అందజేశారు. దైవసేవ చేసుకోవడం మన అదృష్టమని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సమయం కేటాయించాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన

రాజాం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద సదరం సర్టిఫికెట్లు(ధ్రువీకరణపత్రాలు) పునఃపరిశీలించడంతో పాటు దివ్యాంగులకు ఆరోగ్య తనిఖీలు సోమవారం నిర్వహించారు. వెలుగు ఏపీ చిరంజీవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిబాబులు సర్టిఫికెట్లు పరిశీలించి, అర్హులు, అనర్హులను నిర్ధారించారు.

నేటి నుంచి ఆధార్ సేవలు

రాజాం సిటీ: మండలంలోని గడిముడిదాం గ్రామంలో ఈ నెల 18వ తేదీ నుంచి ఆధార్ సేవలు ప్రారంభించనున్నామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఆధార్ నమోదు చేయించుకోని ఆరేళ్లలోపు చిన్నారులు, బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం వేచి చూసే వారంతా ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెరువులు మాయం!

- సోపేరు చెరువుల్లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- భారీ గోతులతో ప్రమాదకరంగా సాగునీటి వనరులు
- ప్రమాదాల బారిన మూగజీవాలు, ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



రూపు కోల్పోయిన సోపేరులోని సాగునీటి చెరువు

రాజాం: మండలంలోని సోపేరు గ్రామంలోని చెరువులు మాయమవుతున్నాయి. కొంతమంది ప్రధాన రహదారుల పక్కనే ఉన్న చెరువులను ఆక్రమించుకుంటుంటే.. మరికొంతమంది చెరువుల్లోని మట్టిని ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు. దీంతో సాగునీటి వనరుల రూపురేఖలు మారిపోతున్నాయి. కొన్నాళ్లుగా ఇది జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూసినట్లు చూస్తున్నారు. సొంత పనుల కోసం పలువురు చెరువుల్లోని మట్టిని భారీగా తవ్వేసి, తరలిస్తుండడంతో పెద్దపెద్ద గోతులు(బంటాలు) ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో నీటితో నిండి ఉండే ఈ చెరువుల్లో ఎక్కడ ఏ గొయ్యి ఉందో తెలియక అందులో దిగే ప్రజలు, దాహార్తి తీర్చుకునేందుకు అక్కడికి వెళ్లే మూగజీవాలు తరచూ ప్రమాదాల బారినపడుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాత్రిపూట తవ్వేసి..

సోపేరులోని పెద్దపెద్ద సాగునీటి చెరువులపై పలువురు గ్రావెల్ వ్యాపారుల కన్ను పడింది. ప్రొక్లెయిన్లు, ట్రాక్టర్లు, లారీలు పెట్టి, చెరువుల్లోని మట్టిని కాజేశారు. ఆ గ్రామం పక్కనే నిర్మిస్తున్న ఓ ప్రైవేటు కంపెనీ యాజమాన్యం అయితే నేరుగా చెరువుల్లోని లక్షలాది టన్నుల గ్రావెల్‌ను తమ సొంతానికి వాడుకున్నారు. ఎర్రమట్టితో ఉండే ఇక్కడి చెరువుల గ్రావెల్ ఎంతో ఉపయోగం కాగా, రాజాం పట్టణానికి దూరంగా గ్రామం ఉండడంతో ఇదే అదునుగా గుట్టుచప్పుడు కాకుండా చెరువుల్లోని మట్టిని రాత్రిపూట తవ్వేసి పట్టుకుపోయారు. దీంతో ఇప్పుడు ఏ చెరువు చూసినా పెద్దపెద్ద బంటాలు(గోతులు)తో అత్యంత ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.



మట్టి తవ్వకాలతో లోతుగా తయారైన లచ్చెమ్మ చెరువు



గ్రావెల్ తవ్వకాలు చేసిన తర్వాత కోనేరు ఇలా..

ఎనిమిది చెరువులదీ అదే పరిస్థితి..

సోపేరు గ్రామంలో మొత్తం ఎనిమిది చెరువులదీ అదే పరిస్థితి. ఏ ఒక్క చెరువునూ అక్రమార్కులు వదల్లేదు. చిన్నాపెద్దా అని చూడకుండా అన్ని చెరువుల్లోనూ యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేసేశారు. ఫలితంగా అక్కడి లచ్చెమ్మ చెరువు, నల్ల చెరువు, సుబ్బన్న చెరువు, కామయ్యబంద, గోకర్ణకోనేరు, శివాలయ కోనేరు, గున్నయ్యబంద, పాపయ్యబంద చెరువులు ప్రస్తుతం లోతుగా ప్రమాదకరంగా తయారయ్యాయి. వాటిని చూస్తున్న వారంతా గతంలో మనం చూసింది ఈ చెరువేనా అనేంతలా ఆ చెరువుల రూపురేఖలు మారిపోయాయి.

చర్యలు తీసుకుంటాం..

సోపేరు చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటాం. వాల్టా యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తాం. ఎక్కడైనా చెరువులు, సాగునీటి కాలువలు ఆక్రమణకు గురైతే తమకు ఫిర్యాదు చేయాలి. – ఎస్‌కే రాజు, తహసీల్దారు, రాజాం

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు



ఆక్రమణలు తొలగించాలని సూచిస్తున్న సీఐ, ఎస్‌లు

రామభద్రపురం: రోడ్డు ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు తీసుకుంటామని సీఐ కె. నారాయణరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రోడ్డు ఆక్రమణలకు గురై ఇరుకుగా తయారైంది. దీంతో భారీ వాహనాలు వచ్చేటప్పుడు తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై అసలే ఇరుకు.. ఆపై భారీ వాహనాలు అనే శీర్షికన ఈ నెల 17వ తేదీన సాక్షి దినపత్రికలో వార్తాకథనం ప్రచురితమైంది. స్పందించిన సీఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావులు గాంధీబొమ్మ సెంటరు నుంచి బొబ్బిలి, సాలూరు జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల యాజమానులతో మాట్లాడారు. రోడ్డులో ఏ మేర అయినా ఆక్రమించుకుంటే అక్కడి నుంచి వెనక్కి షాపులు తగ్గించాలని హెచ్చరించారు. మరోవైపు సాలూరు నుంచి వచ్చే భారీ వాహనాలు రామభద్రపురం గ్రామం మధ్య గుండా రాకుండా బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించేందుకు ఆ మార్గాన్ని పరిశీలించారు.

మాకు ప్రాణహాని ఉంది..



విలేకరుల వద్ద తమ గోడు వినిపించుకుంటున్న బాధితులు

రాజాం: తమకు గ్రామంలోని టీడీపీ కార్యకర్తలతో ప్రాణహాని పొంచి ఉందని మండలంలోని బొమ్మినాయుడువలస గ్రామానికి చెందిన కోళ్ల ఈశ్వరరావు, బి.గొల్లబాబు, పాతినవలస పాపారావు, కోళ్ల చిన్నారావులు వాపోయారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు విలేకరులతో సోమవారం మాట్లాడారు. తమ గ్రామంలో శెగిడివీధి నుంచి మెయిన్ వీధికి వచ్చేందుకు రాస్తా ఉండేదని, ఈ రాస్తాను గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దేశెట్టి గురువులతో పాటు అతని సోదరులు ఆక్రమణ చేశారని పేర్కొన్నారు. ఈ విషయం గ్రామపెద్దలకు చెబితే పట్టించుకోకపోవడంతో బాధితులమంతా కోర్టును ఆశ్రయించామని, ప్రస్తుతం కోర్టులో ఈ కేసు నడుస్తోందన్నారు. అందులో ప్రధాన బాధితులుగా, సాక్షులుగా ఉన్న తమను టీడీపీ కార్యకర్తలైన దేశెట్టి గురువులు, దేశెట్టి నాగేశ్వరరావు, దేశెట్టి నర్సింగరావు, దేశెట్టి అప్పారావులు కేసు తీసేయాలని బెదిరించారని, పలు సందర్భాల్లో భయభ్రాంతులకు కూడా గురిచేశారన్నారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి తమ ఇళ్ల మీదకు వచ్చి, తమపై దాడికి ఎగబడ్డారన్నారు. ఆడవాళ్లని కూడా చూడకుండా తమ కుటుంబాల్లోని ఆడవారి పట్ల అమర్యాదగా ప్రవర్తించారన్నారు. దాడిని కొంతమంది యువకులు అడ్డుకోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని పరుగులెట్టామన్నారు. ఇప్పుడు గ్రామంలోకి వెళ్తే ఏక్షణానైనా తమను చంపేస్తారన్న భయం వెంటాడుతోందన్నారు. పోలీసులు ఈ ఘటనపై అన్నివిధాలా దర్యాప్తు చేసి, తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి



వంగర: విద్యార్థితో పుస్తకంలోని పదాలు చదివిస్తున్న ఎంఈవో జగదీశ్వరి

రేగిడి: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, అక్కన్నఅగ్రహారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించారు. తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నలడిగి వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు విద్యార్థులకు వండిపెట్టాలన్నారు. వన్నలి పాఠశాల నిర్వహణపై ఎంఈవో సంతృప్తి వ్యక్తం చేశారు.

వంగర: విద్యార్థుల విద్యాప్రమాణాలు మరింత మెరుగుపరచాలని ఎంఈవో–2 ఖండాపు జగదీశ్వరి సూచించారు. మండలంలోని మెట్టమగ్గూరు ప్రాథమిక పాఠశాలను ఆమె సోమవారం సందర్శించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు గమనించారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని విద్యార్థులకు తెలిపారు.

తెర్లాం: మండలంలోని కాలంరాజుపేట ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవోలు త్రినాథరావు, పాపారావు సోమవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల డైరీలు, లెస్సన్ ప్లాన్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు రుచి, శుచికరమైన భోజనాలు పెట్టాలని తెలిపారు.

క్రాస్‌ప్రోగ్రాం వాహనం ప్రారంభం



జెండా ఊపి, వాహనం ప్రారంభిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: రానున్న వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మండల కేంద్రంలోని తన కార్యాలయం వద్ద సోమవారం ప్రారంభించారు. ఈ వాహనం ద్వారా గ్రామగ్రామానికి వెళ్లి, పాడైన తాగునీటి బోర్లు మరమ్మతులు చేపట్టి, తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. ఎక్కడైనా బోర్లు పనిచేయకపోతే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, ఏవో శ్రీలత, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్ర ద్రావణం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో పత్ర ద్రావణం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీలు కరణం వరలక్ష్మి, పాగిరి లక్ష్మునాయుడు, గుండాల రవిలు రైతుల పంటపొలాల్లోనే పత్ర ద్రావణాలు తయారు చేసి చూపించారు. వేప, కానుగ, ఉమ్మెత్తు, జిల్లేడు, మారేడు, వెదురు, వావిలాకు, రావి, మందార, కలబంద, తూటికాడ ఆకులు, తులసి, అత్తాకోడల్లాకు, వెంపలాకులతో తయారు చేసే పత్ర ద్రావణం శిలీంద్రనాశినిగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.గోవిందనాయుడు, ఎంపీటీసీ పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని శ్రీహరిపురం, కింజంగి గ్రామాల్లో స్వయం శక్తి సహాయక సంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు సోమవారం సమావేశమై హోం కంపోస్టింగ్, కిచెన్ గార్డెనింగ్ వంటి అంశాలను వివరించారు.

రాజాం సిటీ: ప్రతి ఒక్కరికీ హోంకంపోస్టు తయారీపై అవగాహన అవసరమని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కంచరాం గ్రామంలో వీవోలతో సమావేశమైన ఆయన.. కిచెన్ గార్డెనింగ్, హోం కంపోస్టింగ్‌లపై అవగాహన కల్పించారు.

ఇంకుడు గుంతలు తవ్వించండి

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఉద్యోగులతో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సోమవారం సమావేశమయ్యారు. గ్రామస్తులతో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తవ్వించాలని ఎంపీడీవో సూచించారు. రానున్న వేసవి నేపథ్యంలో ఇంకుడు గుంతల్లోకి వాడుకనీరు, వర్షపునీరు చేరితే భూగర్భజలాలను రక్షించుకోవచ్చని తెలిపారు.

నేటి నుంచి వృత్తి నైపుణ్య శిక్షణ

రాజాం: స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆరు రోజుల పాటు ఈ తరగతులు ఉంటాయని, జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రోగ్రాం సాంకేతిక సహకారం అందిస్తుందన్నారు.

బాడంగి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ట సోమవారం ఘనంగా చేపట్టారు. ఉమారామలింగేశ్వర పంచాయతన సహిత నవగ్రహ సుబ్రహ్మణ్య నాగబంధ దేవతా యంత్ర ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ట మహోత్సవానికి వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ , జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావులు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.స్వామినాయుడు, ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గండ్రేటి కేసరి, సర్పంచ్‌లు పి.గణపతి. డి.దాలినాయుడు, జి.బాబూరావు, పి.ఈశ్వరరావు, ఆర్.స్వామినాయుడు, ఎం.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం కాదు.. వైద్యం అందించే ఆస్పత్రి..



ఈ చిత్రంలోని వాహనాల పార్కింగ్ చూసి ఇదేదో పార్కింగ్ స్థలం అనుకుంటే పొరపాటు పడినట్లే.. రాజాం ఆర్టీసీ బస్టాండ్ దగ్గరున్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఇది. కాంప్లెక్స్‌కు దగ్గరగా ఉండడంతో దూరప్రాంతాలకు వెళ్లే వారు తమ వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేసి, దర్జాగా బస్సులకు వెళ్తున్నారు. ఆస్పత్రికి వచ్చే అంబులెన్సులు, రోగులతో వచ్చే ఇతర వాహనాలు ఇక్కడి వాహనాల పార్కింగ్ వల్ల లోపలికి రాలేని దుస్థితి. దీంతో రోగులు సకాలంలో ఆస్పత్రి లోపలికి వెళ్లలేకపోతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు. – రాజాం

కొనుగోలుదారులపై చర్యలు తీసుకోండి



నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీల దగ్గర నుంచి ప్రభుత్వ, పోరంబోకు భూములు కొనుగోలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న డిమాండ్ చేశారు. తెర్లాం మండలంలోని నందబలగ గ్రామంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలపై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొంతమంది కారు చౌకగా ప్రభుత్వ, పోరంబోకు భుములు కొనుగోలు చేసి దర్జాగా అనుభవిస్తున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొంతమంది బడాబాబులు దళితుల భూములను అన్యాక్రాంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆయన వెంట ఏఐటీయూసీ జిలఆ డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. – తెర్లాం

వెండర్ కోడ్ రద్దు చేయాలని వినతి



వెండర్ కోడ్ ద్వారా చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయండి అని తెర్లాం మండల వైఎస్సార్ సీపీ నాయకుడు గర్భాపు రామారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన పలువురు సర్పంచ్‌లతో కలిసి తెర్లాంలో సోమవారం డ్వామా పీడీని కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని 23 పంచాయతీల సర్పంచ్‌లు వెండర్ కోడ్‌ను రద్దు చేయాలని హైకోర్టులో కేసు వేయడం జరిగిందని, ఇటీవల సాలూరు మండలంలోని సర్పంచ్‌లు కూడా ఇదే విషయంలో కేసు వేస్తే సర్పంచ్‌లకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. న్యాయస్థానం తీర్పు మేరకు వెండర్ కోడ్ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విజయరాంపురం, గోపాలవలస, కాగాం పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు. – తెర్లాం

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: మండలంలోని బొమ్మినాయుడువలస గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాడి చేసిన టీడీపీ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాడి ఘటనలోని బాధితులైన కోళ్ల ఈశ్వరరావు, బి.గొల్లబాబు, పాతినవలస పాపారావు, కోళ్ల చిన్నారావు తదితరులను ఆయన సోమవారం కలిసి పరామర్శించారు. అక్కడి వైద్యులను అడిగి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం క్షతగాత్రుల ఎక్సరేలు, స్కానింగ్‌లు పరిశీలించి, తీవ్రంగా దాడి చేయడంతో ఒకరిద్దరి చేతుల ఎముకలు విరిగాయన్నారు. ఇంత దారుణానికి ఒడిగట్టడం వెనక హత్యకు పథకం వేసినట్లు కనిపిస్తోందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పట్టి నుంచి రాజాంలో దాడులు, దోపిడీలు అధికమయ్యాయని విమర్శించారు. గతంలో కూడా టీడీపీ కార్యకర్తలు బొద్దాంలో తమ పార్టీ కార్యకర్తలపై దాడి చేశారని పేర్కొన్నారు. ఆ ఘటన విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించి ఉంటే ఈ ఘటన పునరావృతమయ్యేది కాదన్నారు. ఏమి చేసినా తప్పించుకోవచ్చు.. తమ చేతిలో అధికారం ఉందనే అహంకారంతో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారన్నారు. బొమ్మినాయుడువలసలో రహదారిని కబ్జా చేస్తుంటే అడిగారని దాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. కులం పేరుతో గ్రామంలో గొడవలు పెట్టేందుకు కవ్వింపు చర్యలకు పాల్పడడం కూడా సిగ్గుచేటన్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే కేసు కట్టేందుకు పోలీసులు వెనుకడుగువేయడం, అవతలి వర్గం నుంచి ఫిర్యాదులు తీసుకుని, కౌంటర్ కేసులు వేయడం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఘటనలు చూస్తే ఇట్టే అర్థమైపోతుందన్నారు. రోజురోజుకూ నియోజకవర్గంలో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయని, పోలీసులు దృష్టిసారించి అరికట్టాలని కోరారు. అనంతరం బాధితులతో మాట్లాడి, పార్టీ పరంగా అండగా ఉంటామని, మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాజాం మండల అధ్యక్షుడు ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బి.నర్సింహులు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, సర్పంచ్‌లు వి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు పూర్తి చేయండి



రాజాం సిటీ: సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామ సచివాలయంలో అందిస్తున్న ఆధార్ సేవలను ఎంపీడీవో లోపింటి త్రినాథ్ సోమవారం పరిశీలించారు. ఆధార్ కార్డులో పేర్లు, అడ్రస్‌ల్లో మార్పులు చేర్పుల కోసం సచివాలయాలను సంప్రదించి, ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో చేపడుతున్న వివిధ సర్వేలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి దీప్తి, డిజిటల్ అసిస్టెంట్ చందు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సేవలందించాలి..

రాజాం సిటీ: సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం, రాజయ్యపేట గ్రామాల సచివాలయాలను ఆయన సోమవారం సందర్శించారు. ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని, పెండింగ్ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.